సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

గురువారం । 26 । డిసెంబర్ । 2024



దర్గాగా.. కబ్జా..!
ప్రభుత్వ భూములు కనిపిస్తే చాలు కబ్జా చేసేందుకు కొంతమంది ఎగబడుతున్నారు. అధికార పార్టీ నాయకుల అండదండలతో ఆక్రమణదారులు చెలరేగిపోతున్నారు. -8లో



వైభవం.. పుష్ప రథోత్సవం
బ్రహ్మంగారిమఠంలోని శ్రీఈశ్వరీదేవిమఠంలో అమ్మవారి ఆరాధన గురుపూజ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం పుష్పరథోత్సవం నిర్వహించారు. -8లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
24.4/21.0
జిల్లాలో బుధవారం 21.0 - 24.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.3 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

ఉప్పొంగిన అభిమానం

కదిలిన పల్లెలు
- తాతిరెడ్డిపల్లెలో కోదండరాముడి విగ్రహావిష్కరణకు హాజరైన మాజీ సీఎం
- వైఎస్ జగన్‌ను చూసేందుకు తరలివచ్చిన పల్లె జనం
- అడుగడుగునా కాన్వాయ్‌ని ఆపి జననేతతో కరచాలనం
- జనం తాకిడితో 30కి.మీ దూరానికి 6గంటల సమయం

సాక్షి కడప: చుట్టుపక్కల పల్లెలన్నీ అటువైపుగానే కదిలాయి. అభిమాన నేతను చూడడానికి ఊర్లకు ఊర్లు కదిలివచ్చాయి.. ఎటు చూసినా జనం.. మిద్దెలెక్కిన అభిమానం.. ఊరూ, వాడా.. చిన్నా, పెద్దా, ఆడ, మగ తేడా లేకుండా అభిమాన నాయకుడిని చూసేందుకు వెల్లువెత్తిన జనగణం.. వెరసి.. వైఎస్ఆర్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అభిమాన జల్లుల్లో తడిసి ముద్దయ్యారు. రోడ్డుకిరువైపులా పచ్చటి అరటి చెట్ల మధ్య సాగిన మాజీ సీఎం వైఎస్ జగన్ ప్రయాణానికి అడుగడుగునా ఘన స్వాగతం లభించింది. 30కి.మీ దూరానికి 6గంటల సమయం పట్టిందంటే జన ప్రవాహం ఎలా ఉందో ఇట్టే అర్థమవుతోంది. పూల వర్షాలతో....జయ జయ హర్షధ్వానాలతో.. డప్పు వాయిద్యాలతో వైఎస్ జగన్ కాన్వాయ్ ముందుకు సాగింది.

ప్రతి చోటా అదే ఆదరణ..
పులివెందుల సీఎస్ఐ చర్చి నుంచి బుధవారం ఉదయం 10.40గంటల ప్రాంతంలో బయలుదేరగా, పార్నపల్లె రింగ్ రోడ్డు నుంచి ప్రతి చోట జనం అభిమానంతో కాన్వాయ్‌ని ఆపుతూ పలకరించారు. ప్రతి ఒక్కరూ తన సెల్‌ఫోన్లలో మాజీ సీఎంతో సెల్ఫీలు తీసుకుని అభిమానాన్ని చాటుకున్నారు. అంతేకాకుండా ఏ ప్రాంతానికి ఆ ప్రాంతం గుర్తుగా చుట్టూ ఉన్న అభిమానులతో వైఎస్ జగన్ సెల్ఫీ ఫొటో స్వయంగా తీసి అందిస్తుండటంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. పార్నపల్లె రింగ్ రోడ్డు నుంచి ప్రారంభమై కోతి సమాధి వద్ద 11.15, చిన్నరంగాపురం 11.30, ఇప్పట్ల క్రాస్ 11.45, చిన్నకుడాల క్రాస్ వద్దకు 12.10గంటలకు చేరుకున్నారు. అనంతరం సమీపంలోని డాక్టర్ అంబేద్కర్ ప్రతిభా గురుకుల పాఠశాల వద్ద 12.25, తర్వాత తేర్నాంపల్లె క్రాస్ వద్దకు 12.40, అక్కులగారిపల్లె క్రాస్ వద్దకు 1గంటకు చేరుకున్నారు. అక్కడ నుంచి చిన్నకుడాల క్రాస్ వద్దకు 1.15గంటలకు చేరుకోగానే, మహిళలు, ఇతర కూలీలు వచ్చి జగన్‌తో ముచ్చటించారు.



తాతిరెడ్డిపల్లెలో జనసందోహం మధ్య మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

కాన్వాయ్ ఆపగానే పొలాలలో ఉన్న వారు సైతం వచ్చి వైఎస్ జగన్‌తో కరచాలనం చేయడం కనిపించింది. తర్వాత లింగాలకు 1.30గంటల ప్రాంతంలో చేరుకున్నారు. లింగాల సమీపంలోని గ్యాస్ గోడౌన్ వద్ద, లింగాల క్రాస్ వద్ద ఇవన్నీ దాటి లోపట్నూతల క్రాస్ వద్దకు రావడానికి 3.05గంటల సమయం పట్టింది. అనంతరం అక్కడ నుంచి కర్ణపాపాయపల్లె వెళ్లేసరికి 4గంటలైంది. తర్వాత అక్కడ నుంచి వెలిదండ్ల క్రాస్ మీదుగా తాతిరెడ్డిపల్లెకు 4.30గంటల ప్రాంతంలో చేరుకున్నారు.

లింగాలలో కొండారెడ్డికి పలకరింపు
మండల కేంద్రమైన లింగాలలో మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కొండారెడ్డిని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలకరించారు. వైఎస్ జగన్ నేరుగా ఆయన వద్దకు నడిచి వచ్చి యోగాక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

కర్ణపాపాయపల్లెలో నాగశేషులరెడ్డికి పరామర్శ
లింగాల మండలం కర్ణపాపాయపల్లెకు చెందిన మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ నాగశేషులరెడ్డిని వైఎస్ జగన్ పరామర్శించారు.



కోదండరామాలయంలో వైఎస్ జగన్‌ను సన్మానిస్తున్న అర్చకులు

వైఎస్ జగన్‌ను కలిసిన పలువురు నేతలు
మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పలువురు నాయకులు కలిసి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. రాజంపేట ఎమ్మెల్యేఅమరనాథరెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, మాజీ ఎమ్మెల్యేలు శ్రీకాంత్‌రెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీ సతీష్‌కుమార్ రెడ్డి, సినీ హాస్య నటుడు జోగి నాయుడు తదితరులు కలిసి పలు అంశాలపై చర్చించారు.

సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలు
పులివెందుల సీఎస్ఐ చర్చిలో క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని వైఎస్ కుటుంబ సభ్యులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోపాటు తల్లి వైఎస్ విజయమ్మ, పెద్దమ్మ వైఎస్ భారతమ్మ, సతీమణి వైఎస్ భారతిరెడ్డి, అత్తమ్మ డాక్టర్ ఇసీ సుగుణమ్మ, పెద్దనాన్నలు వైఎస్ ప్రకాష్‌రెడ్డి, వైఎస్ ప్రతాప్‌రెడ్డి, సోదరులు వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్ మధురెడ్డి, చిన్నాన్న వైఎస్ మనోహర్‌రెడ్డిలతోపాటు ఇతర కుటుంబ సభ్యులు ప్రార్థనలలో పాల్గొన్నారు. తల్లి వైఎస్ విజయమ్మ, పెద్దనాన్న వైఎస్ ప్రకాష్‌రెడ్డి, దివంగత వైఎస్ జార్జిరెడ్డి సతీమణి వైఎస్ భారతమ్మల చేతుల మీదుగా క్రిస్మస్ కేక్‌ను కట్ చేయించారు. అనంతరం వైఎస్ జగన్ వారికి కేక్ తినిపించి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అమ్మ, పెద్దమ్మలిద్దరూ వైఎస్ జగన్‌కు ముద్దు పెట్టి తమ అభిమానాన్ని చూపారు. అనంతరం కొత్త క్యాలెండర్‌ను వైఎస్ కుటుంబ సభ్యులు ఆవిష్కరించారు.



పులివెందుల సీఎస్ఐ చర్చిలో ప్రార్థనల్లో కుటుంబసభ్యులతో వైఎస్ జగన్



వైఎస్ జగన్‌ను ఆప్యాయంగా ముద్దాడుతున్న మాతృమూర్తి విజయమ్మ



ప్రార్థనల్లో పాల్గొన్న గడికోట శ్రీకాంత్‌రెడ్డి, ఆకేపాటి అమరనాథరెడ్డి, అంజద్‌బాషా, కొరముట్ల శ్రీనివాసులు



వైఎస్ జగన్‌కు అభిమాన హారతి

తాతిరెడ్డిపల్లెలో జగన్ పర్యటనకు జన జాతర

జిల్లాలోని లింగాల మండలం తాతిరెడ్డిపల్లెలో జన జాతరే కనిపించింది. శ్రీకోదండరామస్వామి విగ్రహ ప్రతిష్ట సందర్భంగా హాజరైన మాజీ సీఎం వైఎస్ జగన్‌కు జనం హారతులు పట్టారు. ఊరిలోకి వచ్చినప్పటినుంచి ఆలయం వరకు మంగళ వాయిద్యాలతో ఘన స్వాగతం పలుకుతూ తీసుకెళ్లారు. కోదండరామస్వామి విగ్రహ ప్రతిష్ట సందర్భంగా ఆలయానికి వెళ్లగానే ఆయనకు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. వైఎస్ జగన్‌తోపాటు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీ సతీష్ కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిలు కోదండరామ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ తరపున వారిని సన్మానించారు.

నేడు మాజీ సీఎం వైఎస్ జగన్ ప్రజాదర్బార్
పులివెందుల రూరల్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగు రోజుల పర్యటనలో భాగంగా మూడవ రోజు గురువారం పులివెందుల పట్టణంలోని స్థానిక భాకరాపురంలో వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించనున్నారు. పులివెందుల మున్సిపాలిటీ, మండలాల నాయకులు, కార్యకర్తలతో ఆయన ప్రజా దర్బార్ నిర్వహించి వారి సమస్యలను తెలుసుకోనున్నారు.



రోడ్‌షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్ జగన్



మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ నాగశేషులరెడ్డికి వైఎస్ జగన్ పరామర్శ



మహిళలతో సెల్ఫీ..



తాతిరెడ్డిపల్లె రామాలయ ఆవరణలో వైఎస్ జగన్ కోసం ఎదురుచూస్తున్న ప్రజలు

న్యూస్‌రీల్

సదస్సులను సద్వినియోగం చేసుకోండి
కడప సెవెన్‌రోడ్స్: భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్వో విశ్వేశ్వర నాయుడు సూచించారు. ఈ మేరకు గురువారం జిల్లాలోని 33 గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బద్వేల్, పులివెందుల, జమ్మలమడుగు, కడప రెవెన్యూ డివిజన్‌లలోని పలు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు.

కలివికోడిపై కర్ణాటక ట్రైనీ రేంజ్ అధికారులకు శిక్షణ
అట్లూరు: కలివికోడిపై కర్ణాటక ట్రైనీ రేంజ్ అధికారులకు బుధవారం రేంజ్ అధికారి నయీమ్ అలీ శిక్షణ ఇచ్చారు. కర్ణాటక స్టేట్ అకాడమి ట్రైనీ రేంజ్ అధికారులు 42 మంది లంకమల్లేశ్వర అభయారణ్యంలోని కొండూరు బీట్ పరిధిలోని కలివికోడి ఆవాస ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రేంజ్ అధికారి నయీమ్‌అలీ ట్రైనీ రేంజ్ అధికారులకు కలివి కోడి కోసం అమర్చిన కెమెరాలతీరు, కలివి కోడి ఆవాసం అభివృద్ధికి చేపట్టిన చర్యలను వివరించారు.

30న దేశవ్యాప్త నిరసనలు
కడప వైఎస్ఆర్ సర్కిల్: భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై రాజ్యసభలో అవమానకరమైన వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజీనామా కోరుతూ ఈ నెల 30న నిర్వహిస్తున్న దేశవ్యాప్త నిరసనలను జయప్రదం చేయాలని సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు చంద్ర, చంద్రశేఖర్ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. అమిత్ షా వ్యాఖ్యలపై దేశ వ్యాప్తంగా ఆగ్రహావేశాలు పెల్లుబుకుతున్నాయన్నారు. సీపీఐ నగర కార్యదర్శి ఎస్ వెంకట శివ, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బి మనోహర్, రామ్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో క్రిస్మస్





క్రిస్మస్ సందర్భంగా సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలు నిర్వహిస్తున్న విశ్వాసులు





క్రిస్మస్ సందేశం అందజేస్తున్న రెవరెండ్ ఫాదర్ విక్టర్‌బాబు, పశువుల పాకలో బాలయేసు

క్రిస్మస్ పర్వదిన వేడుకలు బుధవారం జిల్లాలో ఘనంగా జరిగాయి. విద్యుద్దీప వెలుగుల్లో .. భారీ క్రిస్మస్ ట్రీలతో.. తళుక్కుమనే స్టార్లతో చర్చిలు శోభిల్లాయి. చిన్నాపెద్దా కలిసి ఆనందంగా ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. క్రీస్తు జన్మం లోకానికి వెలుగై లభించిందని గురువులు ప్రసంగించారు. మన సంతోషాన్ని ఇరుగుపొరుగులతో పంచుకున్నప్పుడే నిజమైన హ్యాపీ క్రిస్మస్ అని వివరించారు. అనంతరం సంతోషంగా పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.
- కడప కల్చరల్

ముసురుకున్న భయం!

- ఇటీవల వచ్చిన వర్షాలకు వరిపంటకు తీవ్రనష్టం
- మరో రెండు రోజులపాటు వర్షాలని ప్రకటన
- ఆందోళనలో అన్నదాతలు

కడప అగ్రికల్చర్: చినుకు మాటెత్తితే చాలు రైతుల్లో వణుకు పుడుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు చాలామంది వరి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇక వర్షాలు తగ్గాయిలే అని తాజాగా వరికోతలు మొదలు పెట్టిన రైతులకూ ఆందోళన తప్పడం లేదు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో మరోసారి వర్షాలు వస్తాయన్న అధికారుల ప్రకటనలతో అన్నదాతల్లో మళ్లీ టెన్షన్ మొదలైంది.

మొదలైన వరికోతలు..
కేసీ కెనాల్ పరిధిలో వరి కోతలు మొదలయ్యాయి. దీంతోపాటు సరైన నీటి సౌకర్యం లేక ఆలస్యంగా పంటలు సాగు చేసుకున్న రైతులు కూడా ఇప్పుడిప్పుడే వరికోతలు మొదలుపెట్టారు. ఉన్నట్లుంటి తుపాన్ ప్రకటించడంతో వరి రైతుల గుండెల్లో గుబులు మొదలైంది. ఇప్పటికే చాలామంది రైతులు వరి పంటను నూర్పిడి చేసి ధాన్యాన్ని పట్టల్లో పెట్టుకుని వర్షం తగ్గితే ఆరబెట్టుకోవాలని చూస్తున్నారు. వానేమో వదలనంటూ ఎప్పుడు పడితే అప్పుడు రాలుతోంది. దీంతో అన్నదాతల్లో అలజడి నెలకొంది.



ధాన్యం తడవకుండా పట్టలు కప్పుతున్న రైతులు

రెండు, మూడు రోజుల క్రితం: జిల్లాలో రెండు రోజులుగా అక్కడక్కడ కురిసిన వర్షానికి ధాన్యం తడిసింది. పైగా 48 గంటల నుంచి ఆకాశమంతా ముసురుకుని ఉండటంతో పాటు ధాన్యం ఆరక అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు.పైగా ధాన్యం ఉడుకెక్కి మొసులు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ముఖ్యంగా కేసీ కెనాల్ కింద...
జిల్లాలో కేసీ కెనాల్ పరిధిలోని దువ్వూరు, మైదుకూరు, ఖాజీపేట, చాపాడు, చెన్నూరు మండలాల్లో చాలా చోట్లు ప్రస్తుతం ముమ్మరంగా వరికోతలు జరుగుతున్నాయి. వరికోత మిషన్లతో వరిపంటను నూర్పిడి చేసి ధాన్యాన్ని తెచ్చి రోడ్ల వెంబటి పట్టల్లో నింపుకున్నారు. ఈ వర్షం కాసింత ఎడితెరిపి ఇస్తే ఆరబెట్టుకుందామని అన్నదాతలు చూస్తున్నారు.

ఆరుబడి పంటలకు తెగుళ్లు...
జిల్లాలో వరుసగా తుఫాన్ ఎఫెక్టుతో సరైన ఎండలు లేక ఆరుతడి పంటలకు తెగుళ్ల బెడద తప్పడం లేదు. సరైన ఎండలు లేకపోవడంతో మినుము, పెసర, పత్తి పంటలకు పురుగు సోకిందని పలువురు రైతులు తెలిపారు.

రెండు రోజులుగా పొలంలోనే..
వర్షం రాదని రెండు రోజుల క్రితం వరికోత మిషన్‌తో రెండున్నర ఎకరాల్లో వరిపంటను నూర్పిడి చేశాను. నూర్పిడి తరువాత ఉన్నట్లుంటి మళ్లీ వర్షాలు పడుతున్నాయి. దీంతో ధాన్యంపై పట్టలు కప్పి పొలంలో ఉంచాను.
- శివారెడ్డి, రైతు, కొత్తపల్లి

జాగ్రత్తలు తీసుకోవాలి...
తుపాన్ కారణంగా ఆకాశమంతా మేఘావృతమై ఉండటంతోపాటు వర్షాలు కూడా కురుస్తున్నాయి. అన్నదాతలు జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా వరి పంటను నూర్పిడి చేసిన రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి.
- ఎ.నాగేశ్వరావు, జిల్లా వ్యవసాయ అధికారి

జిల్లాలో వర్షం
కడప అగ్రికల్చర్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. ఇందులో భాగంగా ఒంటిమిట్టలో అత్యధికంగా 10.6 మి.మీ వర్షం కురిసింది. ఆలాగే సిద్దవటంలో 8.2 , అట్లూరులో 6.4 , గోపవరంలో 4, కలసపాడులో 5.2, కాశినాయనలో 3.8, బికోడూరు, బద్వేల్‌ల్లో 3.6, పోరుమామిళ్ల, బిమఠంలో 3.2, కడపలో 2 , ఖాజీపేటలో 1.2, రాజుపాలెంలో 0.4 మి.మీ వర్షం కురిసిందని అధికారులు వెల్లడించారు.

వేటగాళ్ల కోసం కొనసాగుతున్న వేట
రాయచోటి: రాయచోటి మండలం, మాధవరం అటవీ ప్రాంతంలో కలకలం రేపిన తుపాకీ పేలుళ్ల సంఘటనపై పోలీసులదర్యాప్తు కొనసాగుతోంది. బుధవారం రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్, అర్బన్ సీఐ చంద్రశేఖర్‌లు తుపాకీ పేల్చిన వారిలో ఒకరిని సంఘటన స్థలానికి తీసుకెళ్లి పరిశీలించినట్లు సమాచారం. ఈ వేటలో పాల్గొన్న మిగిలిన వారిని కూడా అదుపులోకి తీసుకున్న తరువాతనే అందరినీ హాజరు పెట్టనున్నట్లు తెలిసింది. అడవి జంతువుల వేటలో పాల్గొన్న వారందరి నుంచి వేటకు ఉపయోగించిన తుపాకుల సేకరణలో పోలీసులు ఉన్నట్లు తెలుస్తోంది.

కానిస్టేబుల్‌దే పెత్తనం
అడవి జంతువుల వేటలో భాగంగా తుపాకీ తూటాలకు బలైన విషయంలో స్టేషన్‌లో పనిచేస్తున్న ఓ కానిస్టేబుల్ ప్రధాన భూమికను పోషిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రాజకీయంగా పలుకుబడి కలిగిన ఆ కానిస్టేబుల్ కేసులో ఎవరిపేర్లు నమోదు చేయాలి, ఎన్ని తుపాకులను చూపించాలని తానే సూచిస్తున్నట్లు పోలీస్ స్టేషన్‌లో చర్చ జోరుగా సాగుతోంది. ఉన్నతాధికారులకు వాస్తవ సమాచారాన్ని అందించాల్సిన పోలీసు నిఘా వర్గాలు కూడా మిన్నకుండిపోతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

త్వరలో నిందితులను హాజరు పరుస్తాం: సీఐ
తుపాకీ కాల్పుల కేసులో నిందితులను త్వరలోనే హాజరుపరుస్తామని రాయచోటి అర్బన్ సీఐ చంద్రశేఖర్ తెలిపారు. సంఘటన జరిగిన ప్రదేశాన్ని బుధవారం డీఎస్పీ కృష్ణ మోహన్‌తో కలిసి రెండోసారి పరిశీలించామన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



కడప అర్బన్ : కడప నగరంలోని ఒన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎల్ఐసీ సర్కిల్ వద్ద ఈనెల 22వ తేదీ అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి బుధవారం మృతి చెందినట్లు ఎస్ఐ అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తిని స్థానికుల సమాచారంతో అంబులెన్స్‌లో రిమ్స్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ అతను మృతి చెందాడు. అతని వద్ద ఎలాంటి ఆధారాలు లేవని ఎస్ఐ తెలిపారు. వివరాలు తెలిసిన వారు 9121100510 లేదా 9121100511 నంబరుకు గానీ సమాచారం ఇవ్వాలన్నారు. ప్రస్తుతం మృతదేహాన్ని రిమ్స్ మార్చురీలో ఉంచారు.

కాలువలో పడి మహిళ మృతి


మృతి చెందిన విజయకుమారి

కడప అర్బన్ : కడప ఒన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మోచంపేటకు చెందిన విజయ కుమారి (33)కి ఉన్నట్లుండి మూర్ఛ రావడంతో కాలువలో పడి మృతి చెందినట్లు ఎస్ఐ అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు మృతురాలికి ముగ్గురు పిల్లలున్నారు. ఆమె ఇటీవలి కాలంలో మూర్ఛవ్యాధితో బాధపడుతూ ఉండేది. రోడ్డుపై వెళుతూ ఉన్నట్లుండి ఫిట్స్ రావడంతో కాలువలో పడి అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

రెండు బైకులు ఢీకొని వ్యక్తికి గాయాలు

కలసపాడు : మండలంలోని సింగరాయపల్లి వద్ద బుధవారం రెండు బైకులు ఢీకొని ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు సింగరాయపల్లి గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు కలసపాడు నుంచి తమ స్వగ్రామానికి టీవీఎస్ ఎక్సెల్ ద్విచక్ర వాహనంలో వెళుతున్నారు. అదే క్రమంలో ఎగువరామాపురం నుంచి ఓ వ్యక్తి కలసపాడుకు ద్విచక్ర వాహనంలో వస్తున్నాడు. పాత రామాపురం సింగరాయపల్లె గ్రామాల మధ్య మలుపు వద్ద రెండు బైకులు ఢీకొని సింగరాయపల్లి గ్రామానికి చెందిన గుడిమే రాజయ్యకు కుడికాలు విరిగింది. స్థానికులు 108 వాహనం ద్వారా పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సలహా మేరకు కడప రిమ్స్‌కు తరలించారు.

మంచాలమ్మ ఆలయంలో చోరీ


బీరువాను పగులగొడుతున్న దొంగలు

నందలూరు : మండలంలోని అడపూరు గ్రామంలోని మంచాలమ్మ తల్లి ఆలయంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. 3 వెండి కిరీటాలు, 3 వెండి దీపాలు, ఒక శఠగోపం, రెండు వెండిప్లేట్లు చోరీకి గురయ్యాయి. ఈ దృశ్యం సీసీ కెమెరాల్లో రికార్డు అయింది. ఈ సందర్భంగా ఏఎస్ఐ సుబ్బరాయుడు మాట్లాడుతూ ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకున్నామన్నారు. రాజంపేట డీఎస్పీ కార్యాలయంలో వేలి ముద్ర నిపుణులు పరీక్షించారన్నారు. ఈ సంఘటనపై దర్యాప్తును వేగవంతం చేశామని పేర్కొన్నారు.

దర్జాగా.. కబ్జా..!


పాములూరు గుట్టను చదును చేసిన ఆక్రమణదారులు


ఇటీవల రెవెన్యూ సదస్సులో అర్జీ ఇస్తున్న గ్రామస్తులు(ఫైల్)

- కోట్లాది రూపాయలు విలువచేసే ప్రభుత్వ భూముల ఆక్రమణ
- చోద్యం చూస్తున్న అధికారులు

వేంపల్లె : ప్రభుత్వ భూములు కనిపిస్తే చాలు కబ్జా చేసేందుకు కొంతమంది ఎగబడుతున్నారు. అధికార పార్టీ నాయకుల అండదండలతో ఆక్రమణదారులు చెలరేగిపోతున్నారు. కన్ను పడితే చాలు భూములు ఆక్రమించి విక్రయాలు జరిపేస్తున్నారు. ప్రభుత్వ భూములతోపాటు డి పట్టా, పోరంబోకు, చెరువు గర్భాలను ఆక్రమిస్తున్నారు. ఆక్రమణదారులకు అధికారులు సహకరిస్తున్నారని ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. వేంపల్లె మండలంలోని పాములూరు గ్రామ పరిధిలో 513/ఎస్1 సర్వే నంబర్లలో కోట్లాది రూపాయల విలువైన 605.8 ఎకరాల ప్రభుత్వ భూములు, గుట్టలు ఉన్నాయి. అయితే కొందరు అధికార పార్టీ నాయకులు ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వేంపల్లె మండలం పాములూరు గ్రామ పంచాయతీలోని భూముల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో ఎకరా రూ.20లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ధర పలుకుతోంది. దీంతో ఇక్కడ ఆక్రమణలు చేసేందుకు అధికార పార్టీ నాయకులు ఎగబడుతున్నారు. 513/ఎస్1 సర్వే నెంబర్లు సుమారు 605.8 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉంది. రెవెన్యూ, రిజిస్ట్రార్ కార్యాలయాల రికార్డుల్లో ఇది పశువుల గుట్టగా నమోదై ఉంది. సుప్రీంకోర్టు తీర్పు మేరకు ప్రభుత్వ భూములు, గుట్టలు ఆక్రమణ చేస్తే నేరమైనప్పటికీ కొంతమంది అక్రమార్కులు ఈ భూమిని ఆక్రమించి గుంతల్లో మట్టిని తోలి చదును చేశారు. ఇక్కడ చదును చేసిన మట్టి కూడా అక్రమంగా జేసీబీలతో తీసినదే కావడం గమనార్హం.

ఈ సర్వే నంబర్లలో ఎవరికీ పట్టాలు లేవు : ప్రభుత్వ భూమి, గుట్టగా నమోదై ఉండడంతో ఈ సర్వే నెంబర్‌లో ఎవరికి ఎలాంటి పట్టాలు ఇవ్వలేదు. కొంతమంది ఆక్రమణదారులు ఈ భూమి పక్కనున్న సర్వే నంబర్‌ను చూపించి గుట్టను చదును చేసుకుంటున్నారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్ సిబ్బందికి భారీగా లంచాలు ఇచ్చి అక్రమాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ భూమి అని కూడా లెక్కచేయకుండా బోర్లు సైతం వేసేందుకు కూడా వెనుకాడటంలేదు. ఇటీవల ఈనెల 17వ తేదీన రెవెన్యూ సదస్సులో పాములూరు గ్రామస్తులు తమ పరిధిలో ఉన్న భూములు ఆక్రమణకు గురికాకుండా చూడాలని అధికారులకు అర్జీలను సమర్పించారు. అయితే అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు వాపోతున్నారు.

భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలి



మా పెద్దల నుంచి ప్రభుత్వ భూములు, గుట్టలుగా ఉన్నాయి. ఇక్కడ వర్షాకాలంలో ఏపుగా గడ్డి పెరగడంతో మా గ్రామస్తులు ఎద్దులు, గేదెలు మేతను మేపుకునేవారు. ప్రస్తుతం కొందరు ఆక్రమణదారులు గుంతలకు మట్టిని వేసి చదును చేసుకుంటున్నారు. మా గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న భూములు అన్యాక్రాంతం జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– మధు ప్రభాకర్ రెడ్డి (ఉప సర్పంచ్), పాములూరు

చర్యలు తీసుకుంటాం



ప్రభుత్వ భూములను ఆక్రమించడం నేరం. ఈనెల 17వ తేదీన జరిగిన రెవెన్యూ సదస్సులో గ్రామస్తులు ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని అర్జీని సమర్పించారు. పాములూరు పంచాయతీ పరిధిలో సర్వే నంబర్ 513ఎస్1ను పూర్తిగా సర్వే చేయమని మా సిబ్బందికి తెలియజేశాం. ఆక్రమణలు చేసినట్లు గుర్తిస్తే తగిన చర్యలు తీసుకుంటాం.

– హరినాథ్ రెడ్డి(మండల తహసీల్దార్), వేంపల్లె

విద్యుత్ చార్జీల బాదుడుపై పోరుబాట

– ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ

బద్వేలు అర్బన్ : విద్యుత్ చార్జీలు పెంచి పేదల నడ్డి విరుస్తున్న కూటమి ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఈ నెల 27న వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు బద్వేలు పట్టణంలో పోరుబాట కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ తెలిపారు. బుధవారం బద్వేలులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఎట్టి పరిస్థితుల్లో విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పిన చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చాక భారీగా విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారం మోపడం దారుణమన్నారు. తమ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈ నెల 27న నియోజకవర్గ ముఖ్య కేంద్రమైన బద్వేలు పట్టణంలో విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ పోరుబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి హాజరవుతారన్నారు.

అదుపు తప్పి చెట్టును ఢీకొన్న కారు

– ఆరుగురికి గాయాలు

సిద్దవటం : మండలంలోని మిట్టపల్లె గ్రామ సమీపంలో బుధవారం తెల్లవారు జామున తిరుపతికి చెందిన కారు అదుపు తప్పి చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆరుగురికి గాయాలైనట్లు హైవే పెట్రోలింగ్ పోలీసులు తెలిపారు. తిరుపతి ఆటో నగర్‌కు చెందిన నాగేష్ , వెంకటయ్య, శ్రీనివాసులు, జ్యోతి, కీర్తన, అభిషేక్‌లు కారులో కర్మ దినానికి హైదరాబాద్‌కు బయలుదేరారు. కారు సిద్దవటం మండలం మిట్టపల్లె గ్రామ సమీపం లోకి రాగానే అదుపు తప్పి రోడ్డు పక్కనున్న చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న వెంకటయ్యకు తీవ్రగాయాలు కాగా మిగిలిన ఐదుగురు స్వల్పంగా గాయపడ్డారు. వీరంతా ఒకే కుటుంబానికి చెందినవారు. వీరిని వైద్యం కోసం 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు.


గొప్ప విద్యాప్రదాత వీరారెడ్డి

రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి


వీరారెడ్డి ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి రామనారాయణరెడ్డి, విజయమ్మ తదితరులు

బద్వేలు అర్బన్ : తాను చదువుకోకపోయినా విద్య విలువ తెలుసుకుని ఎన్నో విద్యాసంస్థలు ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు అండగా నిలిచిన గొప్ప విద్యా ప్రదాత బిజివేముల వీరారెడ్డి అని దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. బిజివేముల వీరారెడ్డి 24వ వర్ధంతి సందర్భంగా బుధవారం మైదుకూరురోడ్డులోని వీరారెడ్డి ఘాట్‌లో, నాలుగు రోడ్ల కూడలిలోని వీరారెడ్డి కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయాల్లోనే ఒక తిరుగులేని నాయకుడిగా వీరారెడ్డి ఎదిగారని అన్నారు. ఎస్‌బీవీఆర్ విద్యాసంస్థల చైర్మన్, మాజీ ఎమ్మెల్యే కె.విజయమ్మ, ఎస్‌బీవీఆర్ విద్యాసంస్థల సెక్రటరీ టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త రితేష్‌రెడ్డిలు మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయాలలో తనకంటూ ప్రత్యేకతను చాటిన రాజకీయ దురంధరుడు, విద్యా ప్రదాత దివంగత బిజివేముల వీరారెడ్డి ఆశయ సాధనకు కృషి చేస్తామని అన్నారు. అలాగే పేదలకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. కార్యక్రమంలో ప్రముఖ కంటివైద్యులు డాక్టర్ కె.రవి కుమార్‌రెడ్డి, విజయమ్మ కోడలు లీలాకై వల్యరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసులరెడ్డి, జిల్లాలోని వివిధ నియోజకవర్గాల నాయకులు, ఆయా మండలాల నాయకులు పాల్గొన్నారు.

వైభవం.. పుష్ప రథోత్సవం


పుష్పరథంపై అమ్మవారి ఊరేగింపు


నృత్యం చేస్తున్న చిన్నారులు

- కనుల పండువగా ఈశ్వరీదేవి ఆరాధనోత్సవాలు
- భారీగా పాల్గొన్న భక్తజనం

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలోని శ్రీ ఈశ్వరీదేవిమఠంలో అమ్మవారి ఆరాధన గురుపూజ మహోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. నాలుగో రోజైన బుధవారం పుష్పరథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. లోకమాత పుష్పరథంపై ఆశీనులై భక్తులను ఆశీర్వదించారు. జగజ్జననికి మఠాధిపతి వీరశివకుమార స్వామి, రాజేశ్వరిదేవి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించారు. గుడి ఉత్సవం చేపట్టారు. ఈ కార్యక్రమానికి నెల్లూరు జిల్లా అనుమసముద్రం మండలం కొలను గ్రామానికి చెందిన లక్ష్మీప్రసన్న, భువనేశ్వర్‌రెడ్డి ఉభయదారులుగా వ్యవహరించారు. బళ్లారికి చెందిన ప్రగతి నృత్యాలయ కళా ట్రస్ట్ బృందం ప్రదర్శించిన నృత్యం అలరించింది. నెల్లూరు జిల్లా ఆత్మకూరుకు చెందిన వీరబ్రహ్మేంద్రస్వామి పాదరేణువులు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఆకట్టుకున్న కోలాటం

శెట్టివారిపల్లెకు చెందిన శ్రీ రామాంజనేయ మహిళా బృందం ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈఓ బీవీ జగన్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో మఠం సిబ్బంది, అమ్మవారి శిష్యులు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో దాతలు విజయవాడకు చెందిన గుంటముక్కల వెంకటేశ్వరరావు, వైజాగ్‌కు చెందిన గోపిశెట్టి సురేంద్రనాథ్, కడపకు చెందిన మునగా బద్రినాథ్ శ్రేష్టి, ప్రకాశం జిల్లా కంభంకు చెందిన తిరువీధి లక్ష్మీరంగయ్యశ్రేష్టి, బ్రహ్మంగారిమఠం ముక్కమల్ల భాస్కర్‌రెడ్డి, సుంకు సురేష్‌బాబు, చెరువుపల్లి ఓంకార స్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు సీపీఐ ఆవిర్భావ దినోత్సవం

- జిల్లాలో పార్టీ పతాకావిష్కరణలు
- 28న కడపలో భారీ ర్యాలీ, బహిరంగ సభ
- హాజరు కానున్న సీపీఐ రాష్ట్ర నాయకులు




గాలిచంద్ర, సీపీఐ జిల్లా కార్యదర్శి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆవిర్భవించి 99 ఏళ్లు పూర్తి చేసుకొని డిసెంబర్ 26 నుంచి వంద సంవత్సరంలో అడుగిడుతున్న సందర్భంగా జిల్లాలో వేడుకలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర మాట్లాడుతూ బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా భారతదేశంలో సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని పిలుపునిచ్చిన ఏకైక పార్టీ సీపీఐ అన్నారు. దేశంలో వందేళ్ల చరిత్ర కలిగిన పార్టీలు కాంగ్రెస్, సీపీఐ మాత్రమేనన్నారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో కమ్యూనిస్టు యోధులు అనేక మంది త్యాగాలు చేశారని, జైలుకెళ్లారని, ప్రాణాలు సైతం తృణ ప్రాయంగా అర్పించారని చెప్పారు. భుక్తి కోసం పీడిత ప్రజల విముక్తి కోసం పార్టీ అనేక పోరాటాలు చేసిందన్నారు. నేటికీ కష్టజీవుల సమస్యల పరిష్కారం కోసం నిరంతర ఉద్యమాలు చేస్తోందని తెలిపారు. జిల్లాలో కడప రేడియో స్టేషన్ సాధనకు విశేష కృషి చేసిందన్నారు. పేదలకు ఇంటి స్థలాల కోసం ప్రత్యక్ష భూ పోరాటాలు నిర్వహించి పేదల కాలనీలను నిర్మించిందన్నారు. సాగునీటి పారుదల ప్రాజెక్టుల సాధన కోసం సాగించిన పోరాటాలకు గుర్తింపుగా గండికోట ప్రాజెక్టుకు ఎద్దుల ఈశ్వర్ రెడ్డి పేరు పెట్టారని పేర్కొన్నారు. ఇలా అన్ని వర్గాల ప్రజల తరపున పోరాటాలు నిర్వహిస్తున్న సీపీఐ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 26న జిల్లాలో వాడవాడలా పార్టీ జెండాలు ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. అలాగే 28న కడప నగరంలో భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి. ఈశ్వరయ్య తదితరులు హాజరవుతారని తెలిపారు.

మాజీ కౌన్సిలర్ తమ్ముడిపై టీడీపీ కౌన్సిలర్ దాడి


దాడిలో గాయపడిన మహమ్మద్ హుసేన్

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని టీడీపీ కౌన్సిలర్ మునీర్, అతని అనుచరులు ఓ మాజీ కౌన్సిలర్ తమ్ముడిపై విచక్షణా రహితంగా దాడి చేశారు. నడిరోడ్డులో కౌన్సిలర్ అనుచరులు కట్టెలతో దాడికి పాల్పడ్డారు. టూ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. షేక్ మహమ్మద్ హుసేన్ గ్రీన్‌ల్యాండ్ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నాడు. తన అన్న మాజీ కౌన్సిలర్ అయిన జిలాన్‌బాషాకు 19వ వార్డు కౌన్సిలర్ మునీర్ తమ్ముడు బషీర్ కొంత డబ్బు బాకీ ఉన్నాడు. డబ్బు విషయమై వారి మధ్య కొంత కాలంగా వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో ఈ నెల 23న రాత్రి డబ్బు విషయమై వారి మధ్య గొడవ జరిగింది. ఈ ఘటనపై 24న రూరల్ పోలీస్ స్టేషన్‌లో మునీర్ ఫిర్యాదు మేరకు మహమ్మద్‌హుసేన్, అతని అన్న జిలాన్‌బాషాపై కేసు నమోదైంది. ఇదే ఘటనకు సంబంధించి మహమ్మద్‌హుసేన్ కూడా మునీర్‌పై రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బుధవారం మధ్యాహ్నం సమయంలో మహమ్మద్ హుసేన్ జిన్నా రోడ్డులో నిలబడి ఉండగా కౌన్సిలర్ మునీర్, తమ్ముడు బషీర్, అస్లాం, మాబుహుసేన్, సలీంతో పాటు మరికొందరు బొలెరో వాహనంలో వచ్చి కట్టెలతో విచక్షణా రహితంగా దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన మహమ్మద్‌హుసేన్ గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు అక్కడికి చేరుకున్నారు. అతన్ని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టూ టౌన్ సీఐ యుగంధర్ తెలిపారు.

సీనియర్ మహిళానేత కృష్ణమ్మకు పరామర్శ


కృష్ణమ్మను పరామర్శిస్తున్న వైఎస్ విజయమ్మ

పోరుమామిళ్ల : పోరుమామిళ్లకు చెందిన సీనియర్ మహిళానేత కృష్ణమ్మను దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సతీమణి విజయమ్మ బుధవారం పరామర్శించారు. మహిళా ఆర్థిక కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా పనిచేసిన కృష్ణమ్మకు వైఎస్ కుటుంబంతో నాలుగు దశాబ్దాలుగా అనుబంధం ఉంది. ప్రతి సంవత్సరం క్రిస్మస్‌కు పులివెందుల వెళ్లి వైఎస్ కుటుంబంతో కలసి వేడుకల్లో పాల్గొనేవారు. ఈ సంవత్సరం అనారోగ్యంతో కృష్ణమ్మ క్రిస్మస్‌కు పులివెందుల వెళ్లలేదు. కృష్ణమ్మ రాకపోవడాన్ని గుర్తించిన విజయమ్మ సాయంత్రం పులివెందుల నుంచి నేరుగా పోరుమామిళ్ల వచ్చి ఆమెను కలసి ఆరోగ్యం గురించి విచారించారు.

బ్రహ్మంగారిమఠం : వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి వియ్యంకుడు ఓబుళరెడ్డి అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. బి.మఠం మండలం చౌదరివారిపల్లెకు బుధవారం సాయంత్రం విజయమ్మ చేరుకుని ఓబుళరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి, డాక్టర్ రమ్యతారెడ్డి, చంద్ర ఓబుళరెడ్డి, మాజీ ఎంపీటీసీ ఎల్.నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన రిటైర్డు లెక్చరర్ మృతదేహం లభ్యం

రామాపురం : వృద్ధాశ్రమం నుంచి అదృశ్యమైన ఓ రిటైర్డు లెక్చరర్ శవమై కనిపించారు. వివరాలు ఇలా.. మండలంలోని బండపల్లె ప్రేమాలయం వృద్ధాశ్రమానికి చెందిన వెంకటరెడ్డి(70) అనే రిటైర్డు లెక్చరర్ ఈనెల 19న బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతని భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో ఈనెల 25వ తేదీ బుధవారం ప్రేమాలయం ఎదురుగా ఉన్న బండరాళ్లలో అతని మృతదేహం లభ్యమైంది. పులివెందుల మండలం భాకరాపురానికి చెందిన వెంకటరెడ్డి గత మూడేళ్ల నుంచి వృద్ధాశ్రమంలో ఉంటున్నారు. మతిస్థిమితం లేక మాత్రలు వాడేవారని భార్య ఫిర్యాదులో పేర్కొన్నారు. కానీ బండరాళ్ల మధ్యలో వెంకటరెడ్డి మృతదేహం కనిపించడంతో పోలీసులు శవపరీక్ష నిమిత్తం లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మిద్దె మెట్లపై నుంచి పడి వ్యాపారి మృతి

మదనపల్లె సిటీ : ప్రమాదశాత్తు కాలు జారి మిద్దె మెట్లపై నుంచి పడి ఓ వ్యాపారి తీవ్రంగా గాయపడి మృతి చెందిన సంఘటన మదనపల్లె పట్టణం కోట వీధిలో బుధవారం జరిగింది. రాజస్థాన్‌కు చెందిన జీవన్‌సింగ్ కుమారుడు గణపతిసింగ్(38) వలస వచ్చి మదనపల్లెలో స్థిరపడ్డాడు. స్థానిక ఆర్‌ఆర్ వీధిలో ఫ్యాన్సీ స్టోర్ పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. ఉదయం షాపునకు వెళ్లేందుకు పై అంతస్థు నుంచి కిందికి దిగి వస్తుండగా ప్రమాదశాత్తు జారి కిందపడ్డాడు. దీంతో తలకు తీవ్రంగా గాయమైంది. కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. మదనపల్లె వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎన్నికల కమిషన్‌ను ప్రజలే రక్షించుకోవాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఎన్నికల కమిషన్‌ను ప్రజలే రక్షించుకోవాలని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ కో–ఆర్డినేటర్ బండి జకరయ్య పేర్కొన్నారు. బుధవారం నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలకు సంబంధించి సీసీ టీవీ ఫుటేజీ, వెబ్ కాస్టింగ్, అభ్యర్థుల వీడియోలు, ఎలక్ట్రానిక్ రికార్డుల తనిఖీని నిషేధించి మోడీ ప్రభుత్వం పారదర్శకతకు పాతర వేసిందన్నారు. రిగ్గింగు, అవకతవకలు సహా ఎన్నికల్లో అక్రమాలను నిరోధించేందుకు సీసీ టీవీలు, వెబ్ క్యాస్టింగ్‌ను కొన్నేళ్ల క్రితం ఎన్నికల కమిషన్ ప్రవేశపెట్టిందన్నారు. ఎన్నికల రికార్డులు బయటపడితే బీజేపీకి ఇబ్బందికరమని భయంతోనే మోడీ సర్కార్ ఎలక్ట్రానిక్ రికార్డుల తనిఖీపై నిషేధం విధించిందన్నారు.

హేళన చేశాడని కత్తితో దాడి


దాడిలో తీవ్రంగా గాయపడిన జైపాల్

ప్రొద్దుటూరు క్రైం : తనను హేళన చేస్తూ వ్యంగ్యంగా మాట్లాడాడన్న కోపంతో జైపాల్ అనే వ్యక్తిపై తండ్రి, ఇద్దరు కుమారులు కలిసి కత్తితో దాడి చేశారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు తాళ్లమాపురం గ్రామానికి చెందిన డేవిడ్ కుటుంబ సభ్యులతో కలిసి మూడు రోజుల క్రితం ప్రొద్దుటూరుకు వెళ్తుండగా వారిని చూసిన జేష్టాది జైపాల్ హేళనగా మాట్లాడాడు. ఈ క్రమంలో క్రిస్మస్ పండుగ సందర్భంగా మంగళవారం రాత్రి జైపాల్, డేవిడ్ కుమారులు అశోక్, అఖిల్ మరి కొందరు కలిసి గ్రామంలో ఉన్న ఎంపీపీ పాఠశాల వద్ద చలిమంట వేసుకున్నారు. అక్కడ వీరంతా వ్యంగ్యంగా మాట్లాడుకుంటూ కూర్చున్నారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన డేవిడ్ తమను అవహేళన చేస్తూ ఎందుకు మాట్లాడతావంటూ జైపాల్‌ను ప్రశ్నించాడు. అక్కడ వారి మధ్య మాటా మాటా పెరిగి ఘర్షణకు దారి తీసింది. డేవిడ్ తన ఇద్దరు కుమారులు కలిసి కత్తితో దాడి చేయగా జైపాల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన జైపాల్‌ను చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అతన్ని కడప రిమ్స్‌కు తరలించారు. ఈ ఘటనపై బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహమ్మద్‌రఫీ తెలిపారు.

పెబ్బేరు టు సేలం.. ఎద్దుల రవాణా

- పట్టుకున్న బి.కొత్తకోట పోలీసులు
- 66 ఎద్దులు గోశాలకు తరలింపు

బి.కొత్తకోట : తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లా పెబ్బేరు నుంచి తమిళనాడుకు అక్రమంగా తరలిస్తున్న ఎద్దులను బి.కొత్తకోట పోలీసులు పట్టుకుని చిత్తూరు జిల్లాకు చెందిన ఏడుగురిపై కేసు నమోదు చేశారు. సీఐ జీవన్ గంగనాథ్‌బాబు కథనం మేరకు వివరాలు.. అనంతపురం జిల్లా నుంచి బి.కొత్తకోట మండలం మీదుగా రెండు లారీల్లో ఎద్దులను తమిళనాడుకు అక్రమంగా తరలిస్తున్నారని బి.కొత్తకోట బీసీ కాలనీకి చెందిన కె.రవీంద్ర బయ్యప్పగారిపల్లె వీఆర్‌ఓ రవికుమార్‌కు సమాచారం ఇచ్చాడు. తహసీల్దార్ సూచనతో వీఆర్‌ఓ పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. జాతీయరహదారిపై పెద్దపల్లి క్రాస్ వద్ద పోలీసులు రెండు లారీలను ఆపి తనిఖీ చేశారు. లారీల్లో 66 ఎద్దులు ఉన్నట్లు గుర్తించారు. వీటిని తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లా పెబ్బేరు మండలంలోని పలు సంతల్లో కొనుగోలు చేసి తమిళనాడులోని సేలంలో జంతువధశాలలకు తరలిస్తున్నట్లు నిర్ధారించారు. అనుమతి, లైసెన్సు లేకుండా అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించడంతో వీఆర్‌ఓ రవికుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు చిత్తూరు జిల్లా పుంగనూరుకు చెందిన ఎస్.మహ్మద్ ఆరీఫ్, పెద్దపంజాణీ మండలం రాయలపేటకు చెందిన షేక్ అబ్దుల్ మునాఫ్, జి.సుబ్రమణ్యం, ఎస్.ముబారక్, కె.కృష్ణప్ప, కె.మాబుబాషా, పలమనేరు పట్టణానికి చెందిన ఎస్.అక్బర్‌లపై కేసు నమోదు చేశారు. వీరిలో ఎస్.మహ్మద్ ఆరీఫ్ పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు. ఎద్దులను తంబళ్లపల్లెలోని నవశక్తి గోశాలకు తరలించారు.

ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొని రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి మృతి


మృతి చెందిన అరమాటి రెడ్డెప్పరెడ్డి

చిన్నమండెం : మండల పరిధిలోని రోడ్డువారికురవపల్లి వద్ద భారత్ పెట్రోల్ బంక్ ఎదురుగా బుధవారం సాయంత్రం ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొని టీవీఎస్ ఎక్సెల్‌లో వెళ్తున్న రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి అరమాటి రెడ్డప్పరెడ్డి(70) అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మండల పరిధిలోని దేవగుడిపల్లె గ్రామం జల్లావాండ్లపల్లెకు చెందిన రిటైర్ట్ ఆర్మీ ఉద్యోగి అరమాటి రెడ్డప్పరెడ్డి బాపూజీనగర్ కాలనీలో ఓ వివాహ కార్యక్రమానికి హాజరయ్యేందుకు టీవీఎస్ ఎక్సెల్ ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. మార్గమధ్యంలో రోడ్డుపై ఆగి ఉన్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి బలంగా ఢీకొనడంతో తలకు తీవ్ర గాయమైంది. వెంటనే స్థానికులు 108కు ఫోన్ చేయగా ఆలస్యంగా వచ్చింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. 108 అంబులెన్స్ సకాలంలో వచ్చి ఉంటే అతను బతికేవాడని స్థానికులు అంటున్నారు. మృతుడు ఆర్మీలో రిటైర్డ్ అయి రాయచోటిలోని స్టేట్ బ్యాంకులో సెక్యూరిటీ గార్డుగా కూడా పనిచేశారు. మృతునికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉండగా అందరికీ వివాహమైంది.